
సాక్షి
అనంతపురం
బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.6°/13.4°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

కూలీల సంఖ్య పెంచకపోతే ఎలా?



మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్‌రెడ్డి

కూడేరు: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచక పోతే ఎలా అని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బందిని ప్రశ్నించారు. కూడేరులో ఉపాధి హామీ కింద చేపడుతున్న రోడ్డు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. రోజుకు మూడు వేల మందికి పని కల్పించాల్సి ఉండగా 900 మందికే పని కల్పిస్తే ఎలా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఏపీఓ తులసీ ప్రసాద్, టీఏ లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

థ్యాంక్యూ జగనన్నా



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సానిపల్లి మంగమ్మ

పెనుకొండ: ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సానిపల్లి మంగమ్మ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆమె.. మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే శంకర నారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకుడు పొగాకు రామచంద్రతో కలసి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఆమెను సోదర ప్రేమతో ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తామన్నారు.

గుండెపోటు.. కలవరపాటు



ఓ వైపు టెక్నాలజీ పెరుగుతోంది.. వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతోంది. మరోవైపు.. మనిషి ఆరోగ్యం మాత్రం అపసవ్య దిశలో పరుగెడుతోంది. ఒకప్పుడు 60 పైబడిన వారిలో మాత్రమే గుండె సమస్యలు కనిపించేవి. నేడు 40 ఏళ్లలోపు వారినీ గుండెపోటు మింగేస్తోంది. గుండెకు శత్రువులు.. రక్తపోటు, మధుమేహం. కానీ, ఇటీవలి కాలంలో ఈ రెండు సమస్యలూ లేకపోయినా చాలామంది గుండెపోటు బారినపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం, వ్యాయామం లేకపోవడం.



- జీవనశైలిలో మార్పులు
- ఆరోగ్య పరీక్షలపై అవగాహన లేమి
- ఆహార నియమాలు, వ్యాయామాలపై నిర్లక్ష్యం
- కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న గుండెపోటు కేసులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

- వారం రోజుల కిందట గుత్తికి చెందిన 38 ఏళ్ల సునీల్‌కుమార్‌కు ఛాతీలో నొప్పి అనగానే హుటాహుటిన అనంతపురం తీసుకొచ్చారు. స్ట్రోక్ బలంగా రావడంతో వైద్యులు ఎంత ప్రయత్నించినా రాత్రికే అతను కన్నుమూశాడు.
- నిన్నగాక మొన్న అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌కు చెందిన తిప్పేస్వామి గుండెపోటుతో మరణించారు. తమ్ముడి అకాల మరణాన్ని తట్టుకోలేకపోయిన అక్క మాధవి 24 గంటల వ్యవధిలో తనూ గుండెపోటుతో మృతి చెందింది.

జిల్లాలో గుండెపోటు కేసులు కలవరపరుస్తున్నాయి. 50 ఏళ్లలోపు గుండెపోటుకు గురవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్న తీరు విస్మయపరుస్తోంది. ఓవైపు ప్రైవేటు ఆస్పత్రులు, మరోవైపు సర్వజనాస్పత్రికి రోజూ వందలాదిమంది గుండె సంబంధిత జబ్బులతో చికిత్స కోసం క్యూకడుతున్న తీరు భయాందోళనకు గురిచేస్తోంది. జీవనశైలిలో వస్తున్న మార్పులు, వ్యాయామం లేకపోవడం వంటి ప్రధాన కారణాలతో వస్తున్న ఈ గుండె జబ్బులు కుటుంబాలను విషాదంలోకి నెడుతున్నాయి. ఏటా ఐదు వేల నుంచి ఆరు వేల మంది వరకూ గుండెపోటుకు గురవుతున్నారు. ఇవి రికార్డు అవుతున్నవి మాత్రమే.. ఇవిగాక మరెన్నో కేసులు ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్నాయి.

గుండెపోటుకు ప్రధాన కారణాలు

- రక్తపోటు నియంత్రణలో లేకపోవడం.. రక్తపోటు ఉందని తెలుసుకోలేక పోవడం
- కొవ్వు పేరుకుపోయి గుండెకు వెళ్లే రక్తనాళాలను పూడ్చివేయడం
- ఒబేసిటీ అంటే వయసు, ఎత్తుకు తగిన దానికంటే బరువు ఎక్కువగా ఉండటం
- ఎక్కువ నూనెలు, కొవ్వులతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం
- తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటుండటం
- ఆరోగ్య పరీక్షలపై అవగాహన లేకపోవడం

జాగ్రత్తలు ఇలా..

- రోజూ క్రమం తప్పకుండా 45 నిమిషాలు వ్యాయామం చేయడం
- 35 ఏళ్లు వచ్చాక మధుమేహం, బీపీ వంటి పరీక్షలు తరచూ చేయించడం
- ఆరుమాసాలకు ఒకసారి విధిగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవడం
- ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం తీసుకోవడం
- షుగర్, బీపీ ఉన్న వాళ్లు మందులతో వాటిని అదుపులో ఉంచుకోవడం
- శరీరంలో కొవ్వు, నూనె మోతాదుకు మించి ఉంటే అదుపులో ఉంచుకోవాలి

గడిచిన ఆరు మాసాల్లో అనంతపురం సర్వజనాస్పత్రిలో నమోదైన గుండెపోటు కేసులు	
నెల	కేసులు
ఆగస్టు	382
సెప్టెంబర్	362
అక్టోబర్	411
నవంబర్	401
డిసెంబర్	432
జనవరి	397

వ్యాయామం చేయకపోతే ప్రమాదమే

యువకుల్లో పూర్తిగా నడక తగ్గిపోయింది. కిలోమీటర్ వెళ్లాలన్నా టూవీలర్‌లోనే వెళ్తున్నారు. ఇష్టారాజ్యంగా కొవ్వుతో కూడిన ఆహారం తినడం, వ్యాయామం చేయకపోవడం వల్ల 30 ఏళ్లకే హార్ట్ స్ట్రోక్ వస్తోంది. శరీరానికి వ్యాయామం మినహా గుండెపోటు నియంత్రణకు మరో మార్గం ఏమీ లేదు. ఆల్కహాల్, సిగరెట్లు అలవాటు ఉంటే మానేయాలి.

–డా.సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, గుండె వైద్య నిపుణుడు

ఒత్తిడితో సమస్యలు జటిలం

విరామం లేని ఒత్తిడి (అన్ రిలీవ్డ్ స్ట్రెస్) కారణంగానే ఇలా జరుగుతోంది. కొందరు ఉద్యోగపరంగా లేదా వైవాహిక పరంగా విపరీత ఒత్తిడికి లోనవుతున్నారు. కొవ్వు సాధారణ స్థాయిలో ఉండి, సన్నగా ఉన్నవారికి కూడా ఒత్తిడితో గుండెపోటు వస్తోంది. పరస్పర అంగీకారంతో కుటుంబాల్లో సమస్యను పరిష్కరించుకుని ఒత్తిడిని తగ్గించుకుని గుండె పోటును దూరం చేసుకోవచ్చు.

–డా.ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణుడు

20 నామినేషన్లు దాఖలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నాలుగో రోజు మంగళవారం 20 మంది అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వద్ద నామినేషన్లు దాఖలు చేశారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా నగరూరు రాఘవేంద్ర, ఆల్‌ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా కురబ ఎస్.మల్లికార్జున, భారతీయ పంచాయత్ పార్టీ అభ్యర్థిగా తూముకుంట మల్లేష్ యాదవ్ (2వసెట్) నామినేషన్ వేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా కోనేటి హరివెంకటరమణ, వెన్నపూస భరత్‌రెడ్డి, కాంతి జాన్‌వెస్లీ, జి.మారుతి, నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, సాబోలు జయకాంత్, పెనుకొండ రవికుమార్, రామచంద్ర, రాజన్న, అశ్వర్థరెడ్డి, కుళ్లాయప్ప, గైబువలి, బోరంపల్లి ఆంజనేయులు, నరసింహమూర్తి (2వ సెట్), ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా కత్తి నరసింహారెడ్డి (2వసెట్), మిట్ట వెంకటగారి శ్రీదేవి, రామశేషయ్య నామినేషన్ వేశారు.

అశ్వవాహనంపై రామలింగేశ్వరుడు



తాడిపత్రి టౌన్: బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు మంగళవారం రాత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి అశ్వవాహనంపై విహరించారు. పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పుర వీధుల్లో అర్చకుల వేదమంత్రోచ్చారణ, వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

త్వరలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు



అనంతపురం అగ్రికల్చర్: త్వరలో జిల్లా వ్యాప్తంగా 26 పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) బి.చంద్రానాయక్ తెలిపారు. రబీలో రైతులు పండించిన పప్పుశనగను ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటా రూ.5,335తో ఆర్‌బీకే వేదికగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఈసారి ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు పంట దిగుబడులు వచ్చాయన్నారు. ఇప్పటికే సీఎం యాప్‌లో 1600 మంది వరకు పప్పుశనగ రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ–క్రాప్ డేటా ఆధారంగా 20 వేల మెట్రిక్ టన్నుల వరకు పప్పుశనగ సేకరణకు అనుమతి ఉందన్నారు.

జొన్నల విక్రయానికి సంప్రదించండి

- జొన్నలు విక్రయించదలచిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని డీఏఓ సూచించారు. క్వింటా కనీస మద్దతు ధర రూ.2,970 ప్రకారం అమ్మిన వెంటనే నగదు చెల్లింపు చేస్తామని తెలిపారు. రానున్న ఖరీఫ్‌లో చిరుధాన్యపు పంటల విస్తీర్ణం పెంపునకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. చిరుధాన్యాలు పండించిన రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా, వినియోగం పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.
- రెండో విడతగా 232 ఆర్‌బీకేలకు అనుబంధంగా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) వచ్చే నెలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

1, 2 తేదీల్లో జెడ్పీ స్థాయీసంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మార్చి 1, 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు సీఈఓ భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ, అదనపు సమావేశ భవనాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, స్థాయీ సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన జరగనున్నట్లు వివరించారు. తొలి రోజు స్థాయీ సంఘం–1, 3, 7 (ఆర్థిక, ప్రణాళిక/వ్యవసాయం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత రోజు స్థాయీ సంఘం–2, 4, 5, 6 (గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్య/సాంఘిక సంక్షేమం/స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు) సమావేశాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరు కావాలని కోరారు. ఈ మేరకు అధికారులకు సమాచారం చేరవేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు తరలిరండి

• మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు భారీగా తరలి రావాలని ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సానిపల్లి మంగమ్మ, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 9 గంటలకు అనంతపురంలోని సంగమేశ్వర పంక్షన్ హాల్‌కు చేరుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైఎస్సార్‌సీపీ తరఫున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా సానిపల్లి మంగమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు వివిధ జిల్లాల్లోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. నామినేషన్ ప్రక్రియకు సంబంధించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాలులో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నామినేషన్ల దాఖలు కార్యక్రమం ఉంటుంది.

అపురూపం.. ఆనందం

అచ్చుగుద్దినట్టు ఒకే రూపు ఉంటారు. చూసేవారికి ఆశ్చర్యం కలిగిస్తారు. వారు ఇంట్లో ఉన్నా.. బడికెళ్లినా.. బజారుకెళ్లినా.. బంధువులతో తిరుగుతున్నా ప్రత్యేకత చాటుకుంటారు. ఇక ఇద్దరూ ఒకే డ్రెస్ వేసుకుంటే ఒక్కోసారి అమ్మానాన్నలే గుర్తు పట్టలేరు. అచ్చం అలాగే ఉన్నవారిని ఒక్క క్షణమైనా ఆగి చూడాలనిపిస్తుంది. పేర్లు అడగాలనిపిస్తుంది. కవలలు అంటే అంతేమరి. ప్రపంచంలో ఏడుగురు మనలాంటి రూపు రేఖలున్నవారు ఉన్నారని చర్చించుకుంటాం. ఏది ఏమైనా కవలలు ఓ అద్భుతం .. విచిత్రం.. నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం. ఈ సందర్భంగా జిల్లాలో పలువురు కవలలపై ప్రత్యేక కథనం.. – అనంతపురం కల్చరల్:

కవలలు ఎవరికైనా ఆసక్తికరంగా కనిపిస్తారు. బాగా తెలిసిన వారికి కూడా ఎవరెవరో పోల్చుకోవడం కష్టసాధ్యమే. కవలల గురించి తెలియజేసే శాస్త్రాన్ని 'జమటాలజి' అంటారు. ఫలదీకరణంలో వచ్చే మార్పుల వల్ల కవలల జననం సంభవిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఒకే రకంగా ఉన్నంత మాత్రాన పోలికలు కానీ, గుణగణాలు గానీ, స్పందనలు కానీ ఒకేలా ఉండవని డాక్టర్ల అభిప్రాయం.

కవలల దినోత్సవ ఆవిర్భావమిలా..

ప్రథమంగా కవలల దినోత్సవాన్ని పోలండ్ దేశస్తులు 1976లో నిర్వహించారు. మోజెస్, విల్‌కాక్స్ అనే కవల సోదరులు తాము నివసిస్తున్న ఊరికి 'ట్విన్స్ బర్గ్' అని పేరుపెట్టుకున్నారు. కవలలనే పెండ్లాడి, మళ్లీ కవలలకే జన్మనిచ్చారు. దురదృష్టమైన విషయమేమంటే ఒకే రకమైన వ్యాధి సోకి ఇద్దరూ ఒకే రోజు మరణించడం. వీరి సంస్మరణార్థం ఏటా ఫిబ్రవరి 22న అంతర్జాతీయ కవలల దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

ఒకేలా ఆటలు

అనంతపురంలోని ఆజాద్ నగర్‌కు చెందిన శివశంకర్, వరలక్ష్మి దంపతుల కవల పిల్లలు హరిణి, హర్ష. వీరిద్దరి ఆలోచనలు ఒకేలా ఉంటాయి. ముఖ్యంగా ఇద్దరూ ఆహారపు అలవాట్లు, అభిరుచుల విషయంలో ఒక్కలాగే ప్రవర్తిస్తారని తల్లిదండ్రులు తెలిపారు.



ఎలాంటి వస్తువైనా ఇద్దరికీ కొనాల్సిందే



తాడిపత్రికి చెందిన షేక్.నాజియా, షేక్.బాబా ఫక్రుద్దీన్‌కు మన్నత్ అఫ్రా, మన్నత్ అమ్హరా పిల్లలు. ఒకే రూపుతో ఆకట్టుకునే ఈ అక్కాచెల్లెళ్లలో తల్లిదండ్రులు ఒకరి కోసం ఏ వస్తువు కొన్నా మరొకరికీ అదే కొనాల్సిందే. అది కూడా ఒకే డిజైన్‌తో ఉండాల్సిందే. డ్రస్సులు, ఆభరణాలు, ఆట వస్తువులు ఇలా ఇద్దరికీ ఒకేలా ఉన్నవే కొనాలి. లేకపోతే ఆ రోజు గొడవే. జ్వరం వచ్చినా, జబ్బు చేసినా ఇద్దరికీ ఒకేసారి వస్తుంది. భోజనం, అల్పాహారం ఇద్దరి ప్లేట్లలో ఒకేలా ఉండకపోతే ఏడ్చేస్తారు. పాఠశాలకు ఒకరు డుమ్మా కొడితే మరో అమ్మాయి కూడా పోనని మారం చేస్తుంది. పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటుగా తాము కూడా ఇద్దరినీ గుర్తు పట్టలేమని, ఏ పని చేసినా ఇద్దరూ ఒకేలా చేస్తుండడమే ఇందుకు కారణమని తల్లిదండ్రులు తెలిపారు. – గుత్తి రూరల్

సందర్భం నేడు కవలల దినోత్సవం

అందరూ తికమక



అనంతపురం నగరానికి చెందిన మల్లికార్జున రెడ్డి, రాధ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరి పిల్లలు సాయి సహస్ర, సాయి సమన్వి ఒకేలా ఉండడమే కాకుండా ఒకే అభిరుచులు, ఇష్టాలతో అందరిని తికమక పెట్టేస్తుంటారు. సంగీతం, చదువులోనూ ఇద్దరూ మంచి ర్యాంకుల్లో ఉంటున్నారు.

వేర్వేరు స్వభావాలు



కవల అన్నదమ్ములు అజ్మల్, అక్మల్ అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో ఉంటున్నారు. మెహబూబా, అబ్దుల్ సమీ సంతానమైన వీరిద్దరూ 8వ తరగతి చదువుతున్నారు. పోలికలు వేర్వేరుగా ఉండడంతో కనుక్కోవడం పెద్ద కష్టం కాదని తల్లిదండ్రులంటారు. చిన్నప్పుడు ఎక్కువ పోలికలుండేవి. చదువు విషయంలో కూడా ఒకరు చురుకుగా ఉంటే, ఆటల్లో మరొకరు ఆసక్తి చూపిస్తారు.

నవ్వుతో ఆకర్షించేస్తారు..



అనంతపురానికి చెందిన షేక్షావలి, రేష్మాభాను దంపతుల పిల్లలు సనా అంజుమ్, సాదియా అంజుమ్. వీరిద్దరూ ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్నారు. దాదాపు ఒకే పోలికల్లో ఉండే వీరిని బయటవారు పోల్చుకోవడం కొంత కష్టంగా ఉంటుంది. ముఖ్యంగా ఇద్దరి నవ్వు అందరిని ఇట్టే ఆకర్షిస్తుందని తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

పోటీ తత్వమెక్కువ



అనంతపురానికి చెందిన ఫక్రున్నీసా, జిలాన్ బాషా దంపతులకు 2015లో ఒకేసారి కవల పిల్లలు బుష్రా, జిక్రా జన్మించారు. దీంతో తల్లిదండ్రుల వారి ఆనందాలకు హద్దు లేదు. పెరుగుతున్న కొద్దీ వీరికి ప్రతిదాంట్లో పోటీ ఎక్కువగా ఉంటోంది. చూడడానికి సన్నగా ఉన్నా వారి ఉత్సాహాన్ని చూసి ఉపాధ్యాయులే ముచ్చటపడుతుంటారు.

వైఎస్సార్‌సీపీని మరువలేం

• బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు

రాప్తాడు రూరల్: దేశ చరిత్రలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ జనాభా ప్రాతిపదికన బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన వైఎస్సార్‌సీపీని బలహీనవర్గాలు ఎన్నటికీ మరిచిపోవని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శాసనమండలి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో 18 స్థానాలకు గాను 14 చోట్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులకు ప్రాధాన్యతనివ్వడం చరిత్రాత్మకమన్నారు. తమది బీసీల పార్టీగా చెప్పుకునే చంద్రబాబు.. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో దానికంటే రెండింతల ప్రాధాన్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తూ తాను బడుగు, బలహీన వర్గాల పక్షపాతినని నిరూపించుకున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏపీ చట్టసభల్లో వడ్డెర్లు అడుగు పెట్టింది లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వడ్డే సామాజిక వర్గానికి చెందిన గుంటూరు జిల్లాలో చంద్రగిరి ఏసురత్నం, పశ్చిమ గోదావరి జిల్లాలో జయమంగళ వెంకటరమణకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చుకోలేమన్నారు.

హోరాహోరీగా వృషభాల బలప్రదర్శన



రాతిదూలం లాగుతున్న దేశీయ వృషభాలు

బొమ్మనహాళ్: ఎణ్ణే రంగనాథేశ్వర స్వామి (యన్నప్ప తాత) ఉత్సవాల్లో బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో మంగళవారం రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తొమ్మిది జతల వృషభాలను పోటీకు రైతులు తీసుకువచ్చారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో గడేకల్లు గ్రామానికి చెందిన రైతు బి.శేఖర్ వృషభాలు రాతి దూలాన్ని 3,750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఆత్మకూరు మండలానికి చెందిన రైతు రంగారెడ్డి వృషభాలు 3,707 దూరం లాగి రెండో స్థానాన్ని, విడపనకల్లు మండలం పెంచలపాడు గ్రామానికి చెందిన రైతు రాకెట్ల భీమలింగప్ప వృషభాలు 3,500 అడుగుల దూరం లాగి తృతీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా విజేత రైతులకు నగదు పురస్కారాలతో గ్రామ పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు సోమనాథగౌడ్, వన్నూరు స్వామి, పెద్ద సుంకన్న, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాలలకు నాక్ గుర్తింపు తప్పనిసరి

అనంతపురం: ప్రతి కళాశాలకు నాక్ గుర్తింపు తప్పనిసరి అని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూలోని కాన్ఫరెన్స్ హాలు నుంచి వర్చువల్ విధానంలో మంగళవారం ఏర్పాటు చేసిన నాక్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్గత నాణ్యతా ప్రమాణాల మదింపు సంస్థ(ఐక్యూఏసీ) డైరెక్టర్ కార్యాలయం, అనంతపురం, పులివెందుల, కలికిరి ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. మంచి నాక్ గ్రేడ్ వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. దీని వల్ల వర్సిటీ నాణ్యత ప్రమాణాలను పెంపొందించుకోవచ్చునన్నారు. నాక్‌లోని వివిధ క్రైటీరియాలను క్షుణ్ణంగా వివరించారు.

దానిమ్మ తోటకు నిప్పు

బొమ్మనహాళ్: మండలంలోని ఏలంజి గ్రామంలో దానిమ్మ తోటకు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దాదాపు 25 ఎకరాల్లో తోట కాలి బూడిదైంది. స్థానికులు తెలిపిన మేరకు... హైదరాబాద్‌లో స్థిరపడిన బాబురావు, మురళీకృష్ణ, వరలక్ష్మి , రేణకకు ఏలంజి గ్రామ రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల పొలం ఉంది. ఇందులో మూడేళ్ల క్రితం దానిమ్మ పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో దానిమ్మ చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఎకరాకు రూ.3 లక్షల చొప్పున రూ.75 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న రాయదుర్గం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఘటనపై విచారణ చేపట్టినట్లు బొమ్మనహాళ్ పోలీసులు తెలిపారు.

ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: జీవితంలో ఎలక్ట్రీషియన్‌గా స్థిరపడాలనుకునే యువతకు ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ అద్భుత అవకాశాన్ని కల్పిస్తోంది. సెంటర్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్ (హౌస్ వైరింగ్, మోటర్ రివైండింగ్) కోర్సుల్లో నైపుణ్య శిక్షణతో పాటు, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హౌస్ వైరింగ్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, విద్యుత్ పరికరాల మరమ్మతు, మోటర్ రివైండింగ్ తదితర అంశాల్లో 45 రోజుల శిక్షణతో పాటు కస్టమర్ రిలేషన్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించనున్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న వారు, 5వ తరగతి నుంచి ఇంటర్ వరకూ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా టూల్‌కిట్, సర్టిఫికెట్‌ను అందజేయడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 85000 74757, 77807 52418లో సంప్రదించవచ్చు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

• గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి
• రాజకీయ వైరి వర్గాలపై నిఘా పెంచాలి
• వార్షిక తనిఖీలో డీఐజీ రవిప్రకాష్



మీడియాతో మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్ : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపాలని డీఐజీ ఎం.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం, స్పెషల్ బ్రాంచి, డీసీఆర్బీ, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం, తదితర విభాగాలలో అన్ని రికార్డులతో పాటు సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం డీఐజీ మీడియాతో మాట్లాడుతూ స్పెషల్ బ్రాంచి పటిష్టమైన సమాచార వ్యవస్థతో నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భూకబ్జాదారులు, అరాచక శక్తులు, కిరాయి హంతక ముఠాల కదలికలపై నిఘా వేయాలన్నారు. ఫ్యాక్షన్ నియంత్రణ కోసం నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. రాజకీయ వైరి వర్గాలు, ట్రబుల్ మాంగర్స్‌పై దృష్టి సారించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అసాంఘిక శక్తుల, చట్ట వ్యతిరేక కార్యకలాపాల సమాచారం సేకరించాలని సూచించారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, రిమోట్ విలేజీలను గుర్తించి, గొడవలు జరుగకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిటీషన్లపై చట్టపరంగా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరాల్లో పురోగతి సాధించాలన్నారు. మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని మహిళలపై నేరాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఫక్కీరప్ప, అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది

• అధికార భాషా సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య



తవ్వా వెంకటయ్యను సన్మానించిన అనంత జిరసం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: మాతృభాష ఔన్నత్యాన్ని కాపాడడంలో ప్రభుత్వానికి ఎంతో చిత్తశుద్ధి ఉందని అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం సాయంత్రం అనంతపురంలోని కేఎస్‌ఎన్‌మహిళా డిగ్రీ కళాశాలలో అనంత జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తవ్వా వెంకటయ్య హాజరై, మాట్లాడారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడడాన్ని అందరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరు రామిరెడ్డి, తెలుగు భాషా వికాస ఉద్యమ నాయకుడు డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, అనంత జిరసం అధ్యక్ష కార్యదర్శులు సాకే శ్రీహరిమూర్తి, తోట నాగరాజు, పాణ్యం వసుంధరాదేవి మాట్లాడుతూ.. తెలుగు మనుగడ ప్రమాదంలో పడకుండా పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గాజుల వెంకటసుబ్బయ్య, సత్యనారాయణరావు, అంకే రామలింగమయ్య, రియాజుద్దీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ చెలరేగిన దారిదోపిడీ ముఠా

• లారీ డ్రైవర్లను బెదిరించి రూ. 50 వేలు అపహరణ
• కత్తులతో దాడి.. లారీ డ్రైవర్లకు గాయాలు



లారీ యజమాని సోమశేఖరరెడ్డి



గాయపడిన లారీ డ్రైవర్ చంద్రశేఖర్

తాడిపత్రి: తమ చర్యలతో పోలీసులకు మరోసారి దారిదోపిడీ ముఠా సవాల్ విసిరింది. గత రెండు రోజులుగా రోడ్డు పక్కన లారీలు నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్లను చితకబాది నగదు దోచుకెళుతున్న దుండగులు.. ఈ సారి ఏకంగా కత్తులతో దాడికి తెగబడి ఇద్దరు డ్రైవర్లను గాయపరిచారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వేకువజాములోపు తాడిపత్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనలు సంచలనం రేకెత్తించాయి. పోలీసులు తెలిపిన మేరకు...

• తాడిపత్రికి చెందిన సోమశేఖరరెడ్డి లారీని ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నెల్లూరు నుంచి అనంతపురానికి పామాయిల్ లోడు తీసుకుని డ్రైవర్ సుబ్బరాయుడితో కలసి బయలుదేరాడు. అర్ధరాత్రి తాడిపత్రి మండలం బొందలదిన్నె వద్దకు చేరుకోగానే నిద్ర ముంచుకు వస్తుండడంతో డ్రైవర్ లారీని రోడ్డు పక్కన ఆపి యజమానితో కలసి వాహనంలోనే నిద్రపోయాడు. మంగళవారం వేకువజామున ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు లారీలోకి ఎక్కి డ్రైవర్ సుబ్బరాయుడు గొంతు అదిమిపట్టి కొడవళ్లు చూపి హతమారుస్తామంటూ బెదిరించి రూ.15 వేలు లాక్కొన్నారు. ఆ పక్కనే ఉన్న సోమశేఖర్‌రెడ్డి అప్రమత్తమై లారీ నుంచి కిందకు దూకడంతో గాయపడ్డాడు. వెంటనే సోమశేఖరరెడ్డిని యువకులు చుట్టుముట్టి అతని వద్ద ఉన్న రూ.20 వేలను దోచుకున్నారు.

• నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి సిమెంట్ లోడుతో బయలుదేరిన కర్ణాటకలోని బెల్గాంకు చెందిన లారీ డ్రైవర్ చంద్రశేఖర్.. తాడిపత్రి మండలం సజ్జలదిన్నె వద్దకు చేరుకోగానే నిద్ర ముంచుకు వస్తుండడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి నిద్రపోయాడు. మంగళవారం వేకువ జామున ద్విచక్ర వాహనంపై అక్కడకు చేరుకున్న ముగ్గురు యువకులు.. కత్తులతో చంద్రశేఖర్ తొడపై దాడి చేసి, రూ.15 వేలు, మెడలోని బంగారు లాకెట్‌ను అపహరించుకెళ్లారు.

రెండు ఘటనల్లో గాయపడిన వారు తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని చికిత్స పొందారు. ఘటనపై సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు వెంటనే ఆస్పత్రికి చేరుకుని బాధితులను విచారణ చేశారు. కేసు నమోదు చేసుకుని, ఘటనాస్థలాలను పరిశీలించారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రాక

ఆత్మకూరు: స్థానిక రామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం మండలంలోని సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

శిశు ఆధార్ సెంటర్ ఏర్పాటు

రాప్తాడు: ఐదేళ్లలోపు చిన్నారులకు శిశు ఆధార్ కార్డు నమోదు చేయనున్నట్లు కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు కేతిరెడ్డి పరంధామ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు ఆ ధార్ కార్డు కోసం చిన్నారి బర్త్ సర్టిఫికెట్, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు. జేఎన్‌టీయూ రోడ్డు చిన్మయనగర్‌లోని 3వ క్రాస్‌లోని కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్ కార్డు నమోదు చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 98490 11015లో సంప్రదించాలన్నారు.

నాణ్యతలో రాజీపడొద్దు


పనులు పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని మేయర్ వసీం నగరపాలక సంస్థ సిబ్బంది, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 38వ డివిజన్‌లోని కోవూర్‌నగర్‌లో రూ.15 లక్షలతో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ఏమైనా ఉంటే తన దృష్టికి నిర్భయంగా తీసుకురావాలన్నారు. అనంతరం స్థానికంగా ఓ టీకేఫ్ వద్ద ఆగిన మేయర్ యువతతో ముచ్చటించారు. బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజాలు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం టవర్‌క్లాక్: నూరుబాషా దూదేకుల కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని నూరు బాషా దూదేకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మున్సిపాల్ చైర్మన్ నూరుమహ్మద్ కోరారు. మంగళవారం స్థానిక ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నూరుమహ్మద్ మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల కేటాయింపులో దూదేకుల కులానికి అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో నబీరసూల్, మస్తాన్‌వలి, గౌస్‌పీరా, అలీబాబా, గౌస్, దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రాఫ్ట్ బజార్

అనంతపురం సిటీ: అనంతపురంలోని చంద్ర హాస్పిటల్ ఎదురుగా బస్టాండ్ గ్రౌండ్‌లో బుధవారం నుంచి క్రాఫ్ట్ బజార్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. చేనేత హస్త కళా ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రవేశం, పార్కింగ్ ఉచితమన్నారు.

పంటల సాగుపై అవగాహన

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం గొల్లపల్లిలో మంగళవారం మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. సరైన సమయంలో పంటలు సాగు చేసుకోవాలని, చీడపీడల బెడద తగ్గి, అధిక దిగుబడులు సాధించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.శివశంకర్‌నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.వెంకటేష్‌బాబు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవికిశోర్, ఏటి వెంకటేశ్వరప్రసాద్, ఏఈఓ ప్రసాద్, వీఏఏ నిర్మల, విద్యార్థులు ప్రియాంక, వేదశ్రీ, రోజా, వైష్ణవి, శ్రీలేఖ పాల్గొన్నారు.

పర్మిట్లు లేకపోతే సీజ్ చేస్తాం


మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, అధికారులు

కనగానపల్లి: పర్మిట్లు లేని స్కూల్ బస్సులను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీవీ రమణ ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాన్ని హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఎంఈఓ అరుణమ్మతో కలసి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమానులతో కలసి సమావేశం నిర్వహించారు. బద్దలాపురం సమీపంలో స్కూలు వ్యాన్ బోల్తాకు గల కారణాలపై విచారించి, ఇందుకు సంబంధించి రోహిత్ పాఠశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. స్కూల్ బస్సులు, వ్యాన్ సరైన కండీషన్‌లో ఉండటంతో పాటు వాటిని నడిపే డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్, ఐదేళ్ల అనుభవం ఉండాలన్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్లకు చెందిన రమేష్ కుమారుడు హిమసాగర్ వైద్యానికి స్నేహితులు రూ.15 వేల ఆర్థికసాయం మంగళవారం అందించారు. రమేష్ కాలసముద్రం గురుకుల పాఠశాలలో 2003-2005 బ్యాచ్‌లో చదివాడు. తన మిత్రుడి కుమారుడు వైద్యం కోసం వాట్సాప్ గ్రూప్‌లో విషయం అందరికీ తెలియజేసి, నగదును అందించారు.

నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి. వ్యాపారం పేరుతో తోపుడుబండ్లు, డీజిల్ ఆటోలు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. నగరంలో రోజు రోజుకూ జనాభా అధికమవుతున్న తరుణంలో రానున్న రోజుల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలతో పెద్ద సమస్య వచ్చిపడే అవకాశం ఉంది.


ట్రిబుల్‌ఎస్ జూనియర్ కళాశాల ఎదుట ఇలా..


సర్వజనాస్పత్రి ముందు ఫుట్‌పాత్‌ల ఆక్రమణ


ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైన దృశ్యం

- ఇబ్బడిముబ్బడిగా వ్యాపారాలు
- నిర్లక్ష్యంలో నగరపాలక సంస్థ అధికారులు

నగరంలోని ఎస్ఎస్ఎస్ కళాశాల ఎదురుగా, గిల్డ్ ఆఫ్ సర్వీసు స్కూల్, సుభాష్‌రోడ్డు, ప్రభుత్వ వైద్య కళాశాల, కలెక్టరేట్ తదితర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ రూ.లక్షలు వెచ్చించి ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసింది. కానీ ఈ ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా వ్యాపారులు ఆక్రమించారు. ఉదయం 6 గంటలు మొదలుకుని రాత్రి వరకు ఫుట్‌పాత్‌లలో జోరుగుగా వ్యాపారాలు జరుగుతున్నాయి. పూలు, పండ్లు, కూరగాయలు, మొక్కలు, డ్రైఫ్రూట్స్, క్యాంటీన్, చికెన్ కార్నర్స్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. వీటిని కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు రోడ్డుకడ్డంగా వాహనాలు ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రికి నిత్యం వేలాది మంది రోగులు వస్తుంటారు. ఆస్పత్రి ముందు పదుల సంఖ్యలో తోపుడు బండ్లు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులు నడిచేందుకు వీలులేని పరిస్థితి. సర్వజనాస్పత్రికి రోజూ 3వేల నుంచి 4 వేల మంది రోగులు వస్తుంటారు. ఆ ప్రాంతం నుంచి రాంనగర్, కోవూర్‌నగర్, అరవిందనగర్, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వేల మంది పాదాచారులు, వాహనదారులు వెళ్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా తోపుడు బండ్లు వెలిశాయి. హెవీ వెహికల్స్ పెద్ద సంఖ్యలో వెళ్తుంటాయి. పొరపాటున ఏమైనా ప్రమాదం చోటుచేసుకుంటే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ వైద్య కళాశాల ముందు కూడా అదే పరిస్థితి.

నిద్రమత్తులో నగరపాలక సంస్థ అధికారులు :
ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులదే. కానీ వారు అటువైపు తొంగి చూడడం లేదు. ముందుచూపు లేకుండా వారు వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్‌లో నగర ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెడుతుందని నగరవాసులు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురైన మాట వాస్తవమే. ట్రాఫిక్ పోలీసులు, నగరపాలక సంస్థ సమన్వయంతో పాదచారులకు వీలుగా ఉండేలా ఫుట్‌పాత్‌లను సిద్ధం చేస్తాం. ఇప్పటికే పలుమార్లు ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డితో సమావేశం నిర్వహించాం. ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటాం.

\- కే భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్

రుచికరమైన భోజనం అందించాలి

- బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి


మాట్లాడుతున్న డీడీ కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: వసతి గృహాల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని వార్డెన్లు, వర్కర్లను బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి ఆదేశించారు. మంగళవారం గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ పక్కన ఉన్న బీసీ వసతి గృహంలో వార్డెన్లు, వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ కుష్బూ కొఠారి మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రతి వార్డెన్ తప్పనిసరిగా మెనూ సక్రమంగా అమలు చేయడంతో పాటు విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. వసతి గృహాల్లో ఎలాంటి అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా వంట గది, భోజనశాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూఓలు, వార్డెన్లు పాల్గొన్నారు.

మాతృభాష గొప్పతనం చాటుదాం

అనంతపురం కల్చరల్: మాతృభాష గొప్పతనాన్ని ఘనంగా చాటుకుందామని పలువురు భాషా ప్రేమికులు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని తెలుగు తల్లి కూడలి వద్ద భాషాప్రేమికులు తెలుగుభాష గొప్పతనాన్ని చాటారు. తెలుగుభాషా వికాస ఉద్యమం, తెలుగు భాషా పరిరక్షణ సమితి, ఎస్ఎస్‌బీఎన్ అధ్యాపకులు, విద్యార్థులు తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. సీనియర్ గాయకుడు కేవీ మహీధరరావు ఆలపించిన 'తెలుగు భాష గొప్పతనం కలనైనా మరవొద్దు ' ఉద్యమ గీతం అందరినీ ఆకట్టుకుంది. ఆయా సంస్థల ప్రతినిధులు సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ, డాక్టర్ రాధేయ, డాక్టర్ నారాయణ, రసూల్ తదితరులు మాట్లాడారు. తెలుగు భాషా ఔన్నత్యాన్ని కొనియాడారు. ×మా తెలుగు తల్లికి మల్లెపూదండ..పాటతో తెలుగు తల్లి విగ్రహ పరిసరాలు మార్మోగాయి. విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టుకుని ఉత్సాహంగా నినాదాలు చేస్తూ తెలుగుతల్లి విగ్రహం వరకుర్యాలీ చేశారు. తెలుగుభాష ప్రచారానికి తోడ్పడుతున్న అధ్యాపకుడు డాక్టర్ నగరూరు రసూల్‌ను సన్మానించారు.


తెలుగు భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో రామకృష్ణుల జయంతి

అనంతపురం కల్చరల్: రామకృష్ణ పరమహంస పరివ్రాజకులు నిత్య స్మరణీయుడని చిన్మయా మిషన్ ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. ఆధాత్మిక గురువులు శ్రీరామకృష్ణ పరమహంస 188వ జయంతి మంగళవారం వేడుకగా జరిగింది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని రామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో ఉదయం వేదపఠనం, గురుదేవుల పూజ, గణపతి హోమం, సరస్వతీ హోమం జరిగాయి. రామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు శ్రీధరమూర్తి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఆత్మవిదానంద స్వామీజీతో పాటు డాక్టర్ కృష్ణశశి, సంధ్యామూర్తి, అధ్యాపకుడు రవిశంకర్ తదితరులు రామకృష్ణ జీవిత విశేషాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నృత్యకళానిలయం నాట్యాచార్యులు సంధ్యామూర్తి ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అమితంగా ఆకట్టుకున్నాయి.


మాట్లాడుతున్న స్వామి ఆత్మవిదానంద సరస్వతి

ప్రొఫెసర్ రవీంద్రనాథ్ సేవలు చిరస్మరణీయం


రవీంద్రనాథ్‌కు సంతాప సూచికంగా మౌనం పాటిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ మాజీ ప్రొఫెసర్ ఎల్‌కే రవీంద్రనాథ్ సేవలు చిరస్మరణీయమని రెక్టార్ ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళవారం కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ ఎల్‌కే రవీంద్రనాథ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి, సంతాపం తెలియజేశారు. రెక్టార్ మాట్లాడుతూ 40 మందికి పీహెచ్‌డీ అవార్డులు అందించడమే కాకుండా, 300 పైగా పరిశోధన పత్రాలను ప్రచురించారన్నారు. తెలుగు అకాడమీ కెమిస్ట్రీ పుస్తకాలను రచించారన్నారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.వెంకట రమణ, ప్రొఫెసర్ కే సుధాకర్ బాబు, డాక్టర్ కే అనిత, ఎకనామిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటనాయుడు, కెమిస్ట్రీ మాజీ ప్రొఫెసర్ కే హుస్సేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నామినేషన్‌కు తరలిరండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు బుధవారం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్యులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారన్నారు. స్థానిక నగరంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రాప్తాడు: వైఎస్సార్ సీపీ మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రా రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బోయ మంగమ్మ నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఉదయం 9 గంటలకు అనంతపురంలోని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసం దగ్గరకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, సోదరులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కాన్వాయ్‌తో సంగమేశ్వర ఫంక్షన్ హాల్ దగ్గరకు చేరుకోవాలన్నారు.

నయన మనోహరం.. వసంతోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో పదిరోజులుగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వసంతోత్సవంతో ముగిశాయి. మంగళవారం ఉదయం ఆలయ నిర్వాహకులు, భక్తులు పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను చందనంతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మంగళవాయిద్యాల హోరు నడుమ వేదపండితులు నరసింహశాస్త్రి, ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు ధ్వజారోహణంతో ఉత్సవాలు ముగిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం ఆలయంలో వసంతోత్సవాలు, త్రిశూల స్నానాలు కోలాహలంగా సాగాయి. మధ్యాహ్నం దీక్షా హోమాలు ముగిస్తూ పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు శివుడికి మహాన్యాసం, ఏకవార రుద్రాభిషేకం, దీక్షాహోమం జరిగాయి. అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. శయనోత్సవం సంప్రదాయ సిద్ధంగా జరిగింది.


వసంతోత్సవాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

మాధవరాజులస్వామికి పూజలు
ఆత్మకూరు: సనప గ్రామంలోని మాధవరాజుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు గ్రామంలోని ఆలయం నుంచి గ్రామం బయట ఉన్న ఆలయానికి ఉరుములు మంగళవాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాహిత్య అధ్యయనం అభినందనీయం


చం.స్పందన అవార్డునందుకుంటున్న దర్భశయనం శ్రీనివాసాచార్యులు

అనంతపురం కల్చరల్: సాహిత్యంలో కొత్త ఒరవడిని కవి దర్భశయనం శ్రీనివాసాచార్యులు తెచ్చారని పలువురు వక్తలు కొనియాడారు. నిరంతర సాహిత్య అధ్యయనంతోనే ఇది సాధ్యమైందంటూ అభినందించారు. చం.స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్యులకు చం.స్పందన జీవిత సాఫల్య పురస్కారమందించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వేదికగా డాక్టర్ హేమమాలిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ కవులు రాజారాం, చం.శాస్త్రి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశాంక మౌళి తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. దర్భశయనం శ్రీనివాసాచార్యులు రచించిన కవితా సంపుటాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు డాక్టర్ శాంతినారాయణ, డాక్టర్ రాధేయ, నబీరసూల్, మధురశ్రీ, అంకె శ్రీనివాస్, డాక్టర్ యోగీశ్వరనాయుడు, మదన్‌మోహన్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని మంగళవారి కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ (మలేరియా, ఫైలేరియా) రామనాథం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. దోమల నివారణకు చేపడుతున్న చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రజలను చైతన్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్రైడే డ్రైడేను పాటించేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, డాక్టర్ మౌనిక, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, మద్దయ్య, నూర్‌బాషా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

పురాతన శివలింగం లభ్యం



ఆత్మకూరు: ఆత్మకూరు సమీపంలోని వెంకట్‌రెడ్డి అనే రైతు పొలంలో మహాశివరాత్రి రోజున జేసీబీతో పనులు చేస్తుండగా పురాతన శివలింగం, నంది రూపంలో ఉన్న రాయి, వినాయకుడి ముఖచిత్రం కలిగిన రాయి, పాదాల ఆకారంలో ఉన్న ధ్వజస్తంభం వంటివి బయటపడ్డాయి. అదే సందర్భంలో అక్కడ ఓ నాగుపాము కూడా ఉందని రైతు, స్థానికులు తెలిపారు. దీంతో వాటిని ఓ చెట్టుకింద ఉంచారు. విషయం కాస్త గ్రామంలో తెలియడంతో స్థానికులు పెద్ద ఎత్తున తరలివెళ్లి, పూజలు చేశారు.

మైనార్టీల సంక్షేమానికి చొరవ చూపండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: మైనార్టీల సంక్షేమానికి చొరవ చూపాలని మైనార్టీ కమిషన్ జాతీయ ప్యానెల్ సభ్యుడు నేసే కిరణ్‌కుమార్ కోరారు. జిల్లా పర్యటనకు మంగళవారం వచ్చిన ఆయన తొలుత ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్పను మర్యాదపూర్వకంగా కలిసి, మాట్లాడారు. నగరంలోని బాలికల ప్రీ మెట్రిక్ హాస్టల్, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక చీఫ్ ప్లానింగ్ కార్యాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ, మైనార్టీ కార్పొరేషన్, వక్ఫ్ బోర్డు, ఉర్దూ అకాడమీ, ఏపీ రెసిడెన్షియల్ (మైనార్టీ) పాఠశాలల అధికారులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. మైనార్టీల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్ సంరక్షణ యోజన పథకంపై ఆరా తీశారు. మైనార్టీల అభ్యున్నతికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ రఫీ, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ మస్తాన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ (ఇన్‌చార్జి) గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దాదులూరు పోతలయ్య పరుష

కనగానపల్లి: మండలంలోని దాదులూరు పోతలయ్యస్వామి జాతర నేటి నుంచి జరగనుంది. మహాశివరాత్రి తర్వాతా పాల్గుణ శుద్ధ పంచమి రోజున పోతలయ్యస్వామి గావుల మహోత్సవం వైభవంగా జరగనుంది. మూడు రోజుల పాటు జరిగే జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. 44వ నంబరు జాతీయ రహదారి పక్కన వెలసిన ఈ ఆలయం రెండు ఆలయ గోపుర ప్రాకారాలతో నిర్మించబడింది. ఇందులో పోతలయ్య, చెన్నేకేశవస్వామి రూపాల్లో శివ, నారాయణ పక్కనే కొలువుదీరి ఉండడం విశేషం. వీరితో పాటు లింగయ్యస్వామి కూడా ఇక్కడే కొలువుదీరి ఉన్నారు. దీంతో ఏటా పోతులయ్య, చెన్నేకేశవ స్వామి కాపులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చి పూజలు చేస్తారు. ఇక పోతలయ్య స్వామికి ప్రత్యేకంగా నిర్వహించనున్న గావుల మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాది సంఖ్యలో భక్తులుతరలివస్తారు.


ఆలయంలో కొలువుదీరిన పోతలయ్య స్వామి

నేటి నుంచి జాతర:
పోతలయ్యస్వామి జాతర బుధవారం నుంచి మూడు రోజులు పాటు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. తొలిరోజు బుధవారం యలవగంప ఊరేగింపుతో జాతర ప్రారంభమవుతుందన్నారు. రామగిరి మండలం గంతిమర్రి నుంచి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు ద్వారా పోతలయ్యస్వామి కాపులు స్వామి వారి ఆభరణాలను బుట్టలో తీసుకొని వచ్చి అలంకరణ చేస్తారు. రెండో రోజు గురువారం పోతలయ్య, చెన్నేకేశవ స్వాములకు జ్యోతుల మహోత్సవం జరుగుతుందన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులు, భక్తులు పన్నేరు బండ్లతో ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఇక మూడో రోజు శుక్రవారం వేకువజామునే తొమ్మిది మంది పోతురాజుల చేత స్వామి వారికి మేక పిల్లలను బలి ఇచ్చే గావుల మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

బైకులకు నిప్పపెట్టిన దుండగులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఖాజానగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మూడు ద్విచక్రవాహనాలకు నిప్పుపెట్టారు. మంగళవారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటనపై బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ సీఐ రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఖాజా నగర్ నందు గంగా గౌరి టాకీస్ వెనుకాల ఉన్న చాపల గుంత దగ్గర యాక్టివా, టీవీఎస్ ఎక్సెల్, యూనికాన్ బైకులకు నిప్పు పెట్టారని ఫిర్యాదు అందిందన్నారు. జగన్నాథ అనే వ్యక్తితోపాటు సమీపంలోనే మరో ఇద్దరి బైక్‌లు కాలిపోయాయన్నారు.

కిశోర్ సేవలు చిరస్మరణీయం

అనంతపురం టవర్‌క్లాక్: బహుముఖ ప్రజ్ఞాశాలి, సీనియర్ జర్నలిస్ట్ వీఆర్ కిశోర్ సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కిశోర్ సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ కిశోర్ ఆంధ్రప్రభ, విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతి, వార్త, సాక్షి పత్రికల్లో రెండు దశాబ్దాలకు పైగా సేవలందించారన్నారు. ఎన్నో వైవిధ్యమైన, మానవీయ, ప్రకృతి రమణీయ కథనాలతో ఆకట్టుకున్నారన్నారు. ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకుంటూ జర్నలిజంలో అనుసరించేవారన్నారు. సామాజిక మాధ్యమాల్లో సైతం తన రచనలు, చిత్ర లేఖనాలు, కవిత్వాలు పోస్టులు పెడుతూ యాక్టివ్‌గా ఉండేవారన్నారు. అలాంటి వ్యక్తి అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడం నమ్మలేకపోతున్నామన్నారు. చదువుకునే సమయంలోనే విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేశారు. తెలుగుభాషపై పట్టు ఉన్న కిశోర్ ఎన్నో కవిత్వాలు రాశారని, రచనలు చేశారన్నారు. ఆర్టిస్టుగాను, చిత్రసీమలోనూ రాణించారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు సి.విశ్వనాథ్, ఆజాద్, టి.రామాంజనేయులు, భోగేశ్వరరెడ్డి మార్కండేయులు, ప్రభాకరనాయుడు, బి.శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్, సనప రామకృష్ణ, కేపీ కుమార్‌తో పాటు వీకే రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కిశోర్ చిత్రపటం వద్ద సంతాపం తెలుపుతున్న జర్నలిస్టులు

సజావుగా ఇంటర్వ్యూలు


పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఈఈఈ విభాగంలో మేధా సర్వో డ్రైవర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇందులో మొదటి లెవల్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ టెస్ట్‌కు 109 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈపరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూలు జరిపి, ఉద్యోగ నియామక పత్రాలు అందించనున్నట్లు జేఎన్‌టీయూ అనంతపురం ప్రాంగణ నియామకాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.సుమలత అన్నారు.